క్లుప్తంగా

బాధిత కుటుంబానికి దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిష్టునాయక్‌తండాకు చెందిన దరావత్ సక్కునాయక్‌కు చెందిన పూరిగుడిసె, పత్తి, నగదు దగ్ధమై ఆ కుటుంబం రోడ్డున పడిన విషయం తెలిసిందే. రాజన్నపేటలకు చెందిన నేతాజీ యూత్ సభ్యులు శనివారం నిత్యావసరాలతోపాటు దుప్పట్లను అందించి ఆసరాగా నిలిచారు. రాజిరెడ్డి, రామకృష్ణ, కల్యాణ్‌రెడ్డి, నర్సింహులు, మల్లయ్య, శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వేములవాడఅర్బన్: పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహంలో శ్రీ భువనేశ్వరి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్యాస్‌వాడకంపై అవగాహన కల్పించారు. గ్యాస్ వాడకంలో మెళకువలు, గ్యాస్ భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఏజెన్సీ మేనేజర్ గోపాల్, విద్యార్థులు ఉన్నారు.

డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలి

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ చిట్నేని సరిత అధికారులను కోరారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన రోడ్డువిస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. రహదారి నిర్మించిన అధికారులు డ్రెయినేజీ నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోందని ఇప్పటికే ఒకసారి నిధులు వెనక్కిమళ్లాయని మరోసారి నిధులు వెనక్కివెళ్లేఅవకాశం ఉందన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్లఅర్బన్: తంగళ్లపల్లి మండలానికి చెందిన మంద అంజయ్య కేడీసీసీ బ్యాంక్ ఖాతాదారుడు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. మృతుడికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతిబీమా యోజన పథకంలో మంజూరైన రూ. 2లక్షల చెక్కును టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు బాధిత కుటుంబానికి అందించారు. సింగిల్‌విండో డైరెక్టర్ బండి దేవదాస్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, రమేశ్‌గౌడ్, సంతోష్‌గౌడ్ తదితరులు వెంట ఉన్నారు.


ఏసీడీ వసూలు విరమించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బోయినపల్లి: విద్యుత్ వినియోగదారులకు శాపంగా మారిన అడిషనల్ కన్‌జెప్షన్ డిపాజిట్ (ఏసీడీ) నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శనివారం సెస్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉదరి నర్సింహచారి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, సారంపల్లి రాజు రాజూరి కిరణ్, ఎడపల్లి పర్శరాం, బొగాని అశోక్, ఐల మహేశ్, కన్నం రాజు, అనీల్ ఉన్నారు.

ఇల్లు లేనివారి వివరాలు సేకరణ



బోయినపల్లి: మండలంలోని గ్రామాల్లో నివాస గృహాలు లేనివారి వివరాలను శనివారం ఆయా గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు సేకరించారు. ఇల్లు లేనివారి ఆధార్, రేషన్‌కార్డులు తదితర పత్రాలను అధికారులు సంబంధిత వ్యక్తుల నుంచి తీసుకున్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసి తహసీల్దార్ కార్యాలయానికి సమర్పించనున్నట్లు కార్యదర్శులు తెలిపారు.

వృత్తి వైద్యం... ప్రవృత్తి నాట్యం..

- ఉద్యోగం చేస్తూ...నాట్యంలో రాణిస్తూ
- కూచిపూడిలో ప్రతిభ చాటుతున్న వనితలు

సండే స్పెషల్



డాక్టర్ శోభారాణి కూచిపూడి నృత్య ప్రదర్శన



సిరిసిల్లఅర్బన్: బీజీగా ఉన్న వారికే మరింత సమయం అందుబాటులో ఉంటుందంటారు విజేతలు. కొత్త విషయాన్ని అధ్యయనం చేయాలంటే సమయం లేదని మరికొందరు అంటారు. ఆసక్తి, అభిరుచి, ఉండాలే కానీ ఎలాంటి వృత్తుల్లో నిమగ్నమైన అంతరంగంలోని అభిరుచికి అనుగుణమైన రంగంలో రాణించడం సమస్య కాదని నిరూపిస్తున్నారు ఈ వనితలు. సమయం సందర్భం లేకుండా రోగులకు చికిత్సఅందించే వైద్యవృత్తి ఒకరిది. తీరిక సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనే అభిలాష మరోకరిది. తమ తమ వృత్తులో రాణిస్తూ అభిరుచికి తగ్గట్టుగా మరో రంగంలో తమదైన ప్రతిభ చాటుతున్నారు. నాట్యంపై ఉన్న మక్కువతో వైద్యవృత్తిలో పంతగాని శోభారాణి, పంతులమ్మగా స్థిరపడిన యశస్విని కళారంగంలో ప్రశంసలు అందుకుంటున్నారు.

అటువైద్యం..ఇటు నాట్యం



ఆమె ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యవృత్తిని చేపట్టి ప్రజలకు వైద్యసేవలు అందిస్తుంటారు. తీవ్రమైన ఒత్తిడి నుంచి బయటపడేందుకు వారికి నచ్చిన వ్యాపకానికి సమయం కేటాయిస్తూ ఆరంగంలో రాణిస్తున్నారు. పెరిగిన స్థలం సాంప్రదాయం వల్ల కూచిపూడి నాట్యంపై మక్కువతో ఐదేళ్ల క్రితం శిక్షణ ప్రారంభించింది. తన కూతురుతో పాటు నాట్యం నేర్చుకుంటూ పలు నృత్యప్రదర్శనలు ఇస్తున్నారు. ఫెడరేషన్ ఆఫ్ గైనాకాలజీ ఆబ్‌స్ట్రేసియన్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రదర్శనలు ఇచ్చారు. వేములవాడలో జరిగిన సాంస్కృతిక వేడుకల్లో ఇచ్చిన ప్రదర్శనల్లో పలువురి ప్రశంసలు అందుకున్నారు. అటు వైద్యవృత్తిని కొనసాగిస్తూ, ఇటు ఇష్టమైన కళారంగంలో రాణిస్తూ కళారంగంపై మక్కువను చాటుతున్నారు. పలు సందర్భాల్లో తల్లికూతుళ్లు ఇద్దరూ ఒకే వేదికపై నృత్య ప్రదర్శనలు చేసి బహుమతులు, ప్రశంసలు అందుకున్నారు.

నృత్యంలో రాణిస్తున్న టీచర్



సిరిసిల్లకు చెందిన అనూష యశస్విని టీచర్‌గా పనిచేస్తూ తీరిక సమయాల్లో నేర్చుకున్న కళను నలుగురి ముందు ప్రదర్శిస్తూ ప్రశంసలు అందుకుంటుంది. చిన్నతనం నుంచి నాట్యం నేర్చుకోవాలన్న తపనతో మూడేళ్ల క్రితం నుంచి కూచిపూడి నేర్చుకుంటోంది. వేములవాడలోని బాలా త్రిపుర సుందరి నాట్యాలయంలో నృత్యంలో శిక్షణ పొందారు. తన కూతురు శ్రీమేధకు సైతం నృత్యం నేర్పిస్తూ ఇరువురు పలు వేదికలపై నృత్యప్రదర్శనలు ఇచ్చారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఉమెన్స్‌ఫెస్టీవ్‌లో యశస్విని రాష్ట్రస్థాయిలో నిలిచి పలువురి మన్ననలు పొందింది. అనేక అవార్డులు సొంతం చేసుకుంది.

కళారంగంపై ఆసక్తి..



వైద్యం, నాట్యం రెండు విభిన్నరంగాలు. ఈ రంగాల్లో రాణించడం అంత సులువేంకాదు. నేర్చుకోవాలనే తపన కళారంగంపై అంకితభావం ఉంటేనే సాధ్యం. సమయం ఉన్నప్పుడు రోజు ఒక్కసారైన ప్రాక్టీస్ చేస్తాను. ప్రస్తుతం ఆన్‌లైన్ క్లాస్‌లో మరింత శిక్షణ పొందుతున్నాను. నాతో పాటు మా పాప కూడా నృత్యకళాకారిణీ. జిల్లా నుంచి ఐఎంఏ, ఫెడరేషన్ ఆఫ్ గైనాకాలజీ ఆబ్‌స్ట్రేసియన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో ప్రదర్శన ఇవ్వడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ పెంచగాని శోభారాణి

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం..



చెక్కులు అందిస్తున్న సర్పంచ్ శివజ్యోతి

తంగళ్లపల్లి: అనారోగ్యం పాలైన నిరుపేదలకు మెరుగైన చికిత్స అందించేందుకు సీఎం సహాయనిధి వరంలా మారిందని మండెపల్లి సర్పంచ్ గనప శివజ్యోతి అన్నారు. శనివారం మండెపల్లి గ్రామపరిధిలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ మంజూరైన చెక్కులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రేఖకు రూ.35వేలు, సత్తవ్వకు రూ.20వేలు, ఎల్లవ్వకు రూ.15వేలు, వెంకలేశంకు రూ.10వేలు చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుస్స స్వప్న, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, ఉపసర్పంచ్ ధర్మారెడ్డి నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు గనప మధన్‌రెడ్డి, బుస్స లింగం, నక్క రవి, గుర్రం కిషన్‌గౌడ్, పెద్ది రాజు పాల్గొన్నారు.

టైరు పేలి కారు బోల్తా

- స్వల్ప గాయాలతో బయటపడిన కుటుంబ సభ్యులు



మర్రిగడ్డ శివారులో బోల్తాపడిన కారు

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ శివారులో శనివారం కారు వెనుక టైరు పేలి బోల్తాపడింది. కథలాపూర్‌కు చెందిన ఓ కుటుంబం పెళ్లి చూపులకు కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగొస్తుండగా మర్రిగడ్డ శివారులోని మూలమలుపు వద్ద వెనుక టైరు పేలింది. కారుబోల్తాపడగా.. అందులో ఉన్న మహిళ తలకు గాయాలయ్యాయి. వెంటనే వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా మాఘమాస జాతర

- పోటెత్తిన భక్తజనం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- అధికారులు, నాయకుల ప్రత్యేక పూజలు
- అన్నదానం, తీర్థప్రసాదాల వితరణ



సిరిసిల్లలోని ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో, నాగారం కోదండ రామస్వామి ఆలయంలో, ధర్మారం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో, కొలనూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాఘమాస జాతర కనుల పండువగా సాగింది. ఆలయ ఆవరణలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సిరిసిల్ల, వేములవాడ, కోనరావుపేట, చందుర్తి, నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీంగల్, తాటిపల్లి తదితర ప్రాంతాల నుంచి సుమారు 60వేలకు పైగా భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బైక్‌లు, కార్లు, ట్రాక్టర్లపై కుటుంబసమేతంగా వచ్చి ఇక్కడే వంటావార్పు చేసుకుని వనభోజనాలు చేశారు. మామిడిపల్లిలో నిర్వహించిన మాఘమాస్య జాతరకు భక్తులు మునుపెన్నడూ లేనివిధంగా అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో వాహనాల తాకిడి ఎక్కువైంది. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సైలు రమాకాంత్, ప్రభాకర్, నాగరాజు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, 50మంది కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు.

నాగాయపల్లిలో శివకల్యాణం

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లి శ్రీదుబ్బరాజేశ్వరస్వామి ఆలయంలో మాఘమాస సందర్భంగా జాతర ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బోనం సమర్పించారు.

రామప్ప రామలింగేశ్వర స్వామి జాతర..

వేములవాడఅర్బన్: మండలంలో కొడుముంజ శ్రీ రామప్ప రామలింగేశ్వర స్వామి ఆలయంలో సర్పంచ్ కదిరే రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీ పార్వతి పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ముస్తాబాద్ ఆలయాల్లో వేడుకలు...

ముస్తాబాద్: ముస్తాబాద్, చీకోడు, రామలక్ష్మణపల్లె, పోతుగల్, మొర్రాయిపల్లె గ్రామాల్లో మాఘ అమావాస్య సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చీకోడులో స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో, ముస్తాబాద్‌లో స్వయంభు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, పోతుగల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో,రామలక్ష్మణపల్లెలో మానేరు తీరంలోని శ్రీరామాలయంలో పూజలుచేశారు. అనంతరం నాలుగు గ్రామాల్లో జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఎడ్లబండ్ల ప్రదర్శన, ట్రాక్టర్ల ర్యాలీలతో అన్నదాతలు మొక్కులు చెల్లించుకున్నారు. చీకోడులో గిరిప్రదర్శనతో రైతులు ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు.

కనుల పండువగా 'అంజన్న' జాతర

గంభీరావుపేట: మండలంలో మాఘ మాస జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. భీముని మల్లారెడ్డిపేట శ్రీ వీరాంజనేయస్వామి ఆల యానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలుచేశారు. మానేరు వాగు తీరాన జాతర సాగింది. రకరకాల వ్యాపార దుకాణాలతో ఆలయ పరిసరాలు జనాలతో కిక్కిరిసిపోయింది. టెస్కాబ్ చైర్మన్‌కొండూరు రవీందర్ రావు, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ చైర్మన్ బాలచందర్ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లుచేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం స్వామివారిని దర్శించుకున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్



మల్లారెడ్డిపేట ఆలయంలో కొండూరి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న మనోహర్‌రెడ్డి



శ్రీ పార్వతి పరమేశ్వరుల కల్యాణం

'అసలే కోతి ఆపై కల్లుతాగింది'



వేములవాడరూరల్: వానారాలు వనం వీడి జనంలోకి రావడంతో పల్లె జనం ఉలిక్కిపడుతున్నారు. ఈ క్రమంలో కులవృత్తిపై ఆధారపడిన గౌడ కులస్తులకు సైతం కోతుల బెడద తప్పడం లేదు. ఈతచెట్లకు కల్లుకుండలు కడుతుండగా కల్లుతాగి కుండలను పగులగొడుతున్నాయని తీగల రాజేశంగౌడ్ తెలిపారు. నూకలమర్రిలో చాలా మంది గౌడ కులస్తులు కులవృత్తిపై జీవిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో వందలాదిగా వానర సైన్యం వచ్చి చేరడంతో పాటు ప్రతిరోజూ తాటిచెట్లపై కల్లు తాగుతూ కుండలు పగులగొడుతున్నాయని దీంతో నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా కోతుల బెడద నుంచి తమను రక్షించాలని కోతుల రాకతో తమకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని దూరప్రాంతాలకు తరిమి ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

చెక్‌డ్యాం పనులు అడ్డుకుంటాం



లింగంపల్లి వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యాం

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామం వద్ద నిర్మించే చెక్‌డ్యాం ఎత్తు పెంచితే భవిష్యత్‌లో గ్రామానికి ప్రమాదం పొంచి ఉంటుందని సర్పంచ్ సామ కవిత అన్నారు. గత కొన్నిరోజులుగా గ్రామస్తులు చెప్పినప్పటికీ కాంట్రాక్టర్ పెడచెవిన పెడుతున్నాడని, వెంటనే ఎత్తు తగ్గించి సైడ్‌వాల్ ఎత్తులను పెంచాలని ఆమె కోరారు. అలాగే నిర్మిస్తే గ్రామస్తులతో కలిసి పనులు అడ్డుకుంటామన్నారు. ఈ విషయంపై అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా గ్రామస్తుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు.

సైడ్‌వాల్ ఎత్తు పెంచాలి



లింగంపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనుల్లో సైడ్‌వాల్ ఎత్తుపెంచాలి. సైడ్‌వాల్ ఎత్తు పెంచకపోతే కట్టఎత్తును తగ్గించాలి. లేకపోతే గ్రామానికి భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయి. సమస్య పరిష్కరించాలి.

– దుమాల నర్సయ్య, రైతు, లింగంపల్లి

చర్యలు తీసుకోవాలి



మూలవాగులో నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ కట్ట ఎత్తు తగ్గించి సైడ్‌వాల్ పెంచాలి. లేకపోతే భవిష్యత్‌లో పొలాలు, గ్రామానికి నీరువస్తది. ఈ విషయంలో అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

– మంతె మల్లయ్య, రైతు, లింగంపల్లి

సమాచారం..

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని లక్ష్మీపూర్, హన్మక్కపల్లి, లాలపల్లి, బాలానగర్, జయవరం, తిప్పాపూర్, కోనాయపల్లి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ అనూష శనివారం తెలిపారు. మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. సెస్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

24న మండల సర్వసభ్య సమావేశం

కోనరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తదితరులు హాజరవుతున్నారన్నారు. అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నిరుపేద కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీటీసీ అరుణ్ కుమార్

వీర్నపల్లి: భవన నిర్మాణ నిరుపేద కార్మికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వీర్నపల్లి ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంకేంద్రంలో శనివారం సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్, నిర్మాణ యూనియన్ భవన నిర్మాణ మండల అధ్యక్షుడు భూస రాజం ఆధ్వర్యంలో కార్మికులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంపీటీసీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌వేశారు. మండలంలో 200పై చిలుకు కుటుంబాలు భవన నిర్మాణం పనులపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరికి కనీసం ఉండేందుకు ఇల్లు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదం జరిగితే ప్రభుత్వం బాధ్యత వహించి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌వేశారు. కేంద్రప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన 4 లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. వీరికి పెట్టుబడి సాయంకింద రూ.10లక్షలతో కార్మికబంధు తీసుకురావాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించికపోతే తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ,(బీడబ్ల్యూసీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్, సీఐటీయూ అనుబంధ సంస్థ సుతారీ సంఘం మండల అధ్యక్షుడు భూసరాజం, సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజయ్య, మాజీ అధ్యక్షుడు దేవయ్య, మండల నాయకులు శంకర్, చంద్రయ్య, దేవరాజు, శోభన్, బాబు, అంజయ్య, రాజెల్లయ్య, శంకర్ కార్మికులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



ఎల్లారెడ్డిపేటలో స్వామివారికి అభిషేక పూజలు

ఎల్లారెడ్డిపేట: మండల వ్యాప్తంగా మాఘ అమావాస్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిపేటలోనిశ్రీ లక్ష్మి కేశవ పెరుమాండ్ల ఆంజనేయ స్వామి, అక్కపల్లిలోని బుగ్గారాజేశ్వర స్వామి, నారాయణపూర్ శివారులోని ఆంజనేయస్వామి, గొల్లపల్లిలోని గాలం గుట్ట ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల్లో ఆలయకమిటీ సభ్యులు అన్ని వసతులు కల్పించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.